కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఎంపిక చేసిన 10 ఆదర్శనీయ ప్రాంతాల్లో ఒకటిగా తిరుమల క్షేత్రానికి స్థానం లభించినట్లు టీటీడీ ఈవో డాక్టర్ దొండపాటి సాంబశివరావు వెల్లడించారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో సోమవారం అధికారులతో సమావేశమైన ఈవో అభివృద్ధిపనుల పురోగతిపై సమీక్షించారు.

# స్వచ్ఛభారత్ మిషన్‌లో తిరుమల

- రూ.26 కోట్లతో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు
- మరో రూ.5.5 కోట్లతో కొండపై ఎల్‌ఈడీ బల్బులు
- టీటీడీ అధికారుల సమీక్షా సమావేశంలో ఈవో దొండపాటి



**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** స్వచ్ఛ భారత్‌లో తిరుమల చేరిందని ఈవో దొండపాటి సాంబ శివరావు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్రం దేశంలోని 100 ఆదర్శనీయ ప్రాంతాలను అభివృద్ధి పరచాలని నిర్ణయించిందని, తొలి దశలో 10 ప్రాంతాలను ఎంపిక చేసిందన్నారు. ఈ పదింటిలోనూ తిరుమల కూడా ఉండటం శుభపరిణామమన్నారు. తిరుమలను మరింత ఆదర్శనీయ ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలైన కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ సంస్థలు సామాజిక

▶ మిగతా II లో

# 'స్వచ్ఛభారత్'లో తిరుమల

Iవ పేజీ తరువాయి

బాధ్యతగా నిధులు మంజూరు చేస్తాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తిరుమలలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.26 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ఆయా సంస్థలకు పంపుతున్నామన్నారు. తిరుమలలోని మురుగునీటిశుద్ధి ప్లాంటు ద్వారా రోజుకు 20 ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించడం జరుగుతుందన్నారు. మరో 5ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేయడం జరిగితే తిరుమలలోని ఉద్యానవనాలు, శ్రీగంధం మొక్కలు, ఘాట్‌రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలకు సమృద్ధిగా నీరందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఇందుకోసం రూ.6 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఘనపదార్థాల నిర్వహణకు సంబంధించి రూ.1.50 కోట్లు ఖర్చవుతుందన్నారు. ప్రస్తుతం తిరుమల కొండపై ఉన్న విద్యుత్‌బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసేందుకు రూ.5.50 కోట్లు అవసరమన్నారు. వాయుకాలుష్యాన్ని నియంత్రించేందుకు బ్యాటరీ కార్లు, ఎలక్ట్రిక్ బస్సుల వాడకం పెరగాలన్నారు. ఇందుకోసం రూ.6 కోట్లు ఖర్చవుతుందన్నారు. అదేవిధంగా భక్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మరో 20 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందనీ, ఇందుకోసం మరో రూ.2 కోట్లు అవసరమన్నారు. ఈపనులన్నీ పూర్తయితే తిరుమల భక్తులకు అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లేనని ఈవో సాంబశివరావు పేర్కొన్నారు. సమావేశంలో తిరుపతి, తిరుమల జేఈవోలు పోలా భాస్కర్, కేఎస్ శ్రీనివాసరాజు, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఈలు రమేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

సాక్షి
చిత్తూరు
Tue, 20 September 2016
epaper.sakshi.com//c/13350831